క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. నరాల, గుండె జబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పీహెచ్‌డీలో పట్టా సాధించిన సౌజన్య

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.వి.సౌజన్యకు పీహెచ్‌డీలో పట్టా లభించింది. సౌజన్య జేఎన్టీయూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పనిచేస్తూనే డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యూనివర్సిటీలో ఆరేళ్లుగా పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు బి.వి.సౌజన్య మాట్లాడుతూ కమ్యూనికేషన్స్, ఇమేజ్ ప్రాసెసింగ్‌ను ఉపయోగించి ఒక అల్గారిథమ్, విభిన్న సాంకేతికత యొక్క విశ్లేషణకుగాను పీహెచ్‌డీ పట్టా ఇచ్చారన్నారు. దీంతో అధ్యాపకురాలు సౌజన్యను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు తెలిపారు.


మునిబాబుకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న ఎం.మునిబాబు

లింగాల : మండలంలోని కామసముద్రం గ్రామానికి చెందిన మొమ్మెల మునిబాబు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం అనంతపురం జెఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి చేతులమీదుగా అయన డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. జెఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ప్రవీణ్ శ్యాంల సంయుక్త ఆధ్వర్యంలో వీడియో ట్రాని స్మషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఇన్ వైర్ లెస్ నెట్ వర్క్‌ లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. మునిబాబును ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఉగ్రవాదుల చర్యలు దారుణం



పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

వేంపల్లె : కాశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదులు భారతీయులను చంపడం దారుణమైన చర్య అని ఎంపీటీసీ రహంతుల్లా ఖాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పకీరుపల్లెలో పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ ముస్లిం మైనార్టీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్‌కు కులం, మతం, మంచి, చెడు, జాలి, దయ అసలు ఉండవన్నారు. ఈ సంఘటనను యావత్ ముస్లిం సమాజం ఖండిస్తోందన్నారు. అనంతరం జిల్లా జమాతే ఆహలే హదీస్ అధ్యక్షుడు బషీర్ మౌలానా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు మళ్ళీ మళ్ళీ పునరావృతం కాకుండా వారికి సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎవరైనా ఒక మానవాళిని చంపితే సర్వకోటి మానవులను చంపినట్లేనని ఇస్లాం చెబుతోందన్నారు. కార్యక్రమంలో ముస్లింలు, పెద్దలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన తప్పనిసరి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీఓ తిమ్మక్క తెలిపారు. శుక్రవారం చిలంకూరు, పోట్లదుర్తి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి నుంచి వస్తున్న తడి పొడి చెత్తను సిబ్బంది విడివిడిగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రహంతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌తో ఉన్నత శిఖరాలకు

- పాలిసెట్, ఏపీఆర్‌జేసీకి 201 మంది హాజరు
- 16 ఏళ్లుగా ఉచిత కోచింగ్ అందిస్తున్న ఉపాధ్యాయ బృందం



ఉచిత కోచింగ్ అందిస్తున్న ఉచిత విద్య ఉపాధ్యాయుడు

పులివెందుల టౌన్ : పేద విద్యార్థుల పాలిట ఒక వరంలా ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం నిలుస్తోంది. ప్రతి ఏడాది పదో తరగతి అనంతరం పాలిసెట్, ఏపీఆర్‌జేసీల్లో కోచింగ్ తీసుకొనే గ్రామీణ, పట్టణ పేద విద్యార్థులకు మేమున్నామంటూ భరోసా ఇస్తోంది. సెలవుల్లో కూడా తమ కుటుంబంతో సరదాగా గడపాలని అనుకోకుండా పేద విద్యార్థుల భవిష్యత్ కోసం ఆరాటపడుతూ ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం. విద్యార్థులకు అన్ని విధాలా అర్థమయ్యేలా వివిధ సబ్జెక్టులలో మెలుకువలు తెలుపుతూ పాలిసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్‌లో మంచి ర్యాంకులు సాధించేలా విద్యనందించి తీర్చిదిద్దుతున్నారు. 16 ఏళ్లుగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో పాతసత్రం బడి పాఠశాలలో ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం నలుగురితో మొదలై ఇప్పుడు 39 మంది ఉపాధ్యాయులు ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ఇక్కడ సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)నందు కోచింగ్ ఇవ్వడంతో మన జిల్లానుంచే కాకుండా రాయలసీమలోని జిల్లాలనుంచి కూడా విద్యార్థులు ఇక్కడ కోచింగ్ తీసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 201 మంది పేద విద్యార్థులు ఉచిత కోచింగ్ తీసుకుంటున్నారు.

ర్యాంకు తప్పకుండా సాధిస్తా



ఏపీఆర్‌జేసీలో తప్పకుండా ర్యాంకు సాధిస్తాను. ఎందుకంటే ఇక్కడ ఉచిత కోచింగ్ ఎంతో బాగా ఇస్తున్నారు. డబ్బుపెట్టినా ఇంతబాగా అర్థమయ్యేలా చెప్ప రేమో అనిపిస్తుంది. పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– శ్రావణి, విద్యార్థిని

అర్థమయ్యేలా చెబుతున్నారు



పాలిసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ తీసుకుంటున్నాను. కోచింగ్ ఎలా ఉంటుందో అనుకున్నాను. బాగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటికి రెండుసార్లు అడిగిన విసిగించుకోకుండా చెప్పడం చాలా బాగుంది. బాగా అర్థమవుతుంది.

– సుందరేశ్వర్, విద్యార్థి

పేద విద్యార్థుల కోసం



ఉచిత కోచింగ్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. అందుకోసం ఉపాధ్యాయ బృందం ముందుకు వచ్చి సహకరించడం ఆనందంగా ఉంది. పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం ద్వారా వారికి మంచి సీట్లు సాధించి ఉన్నత స్థానంలో ఉంటే అది ఎంతో తృప్తినిస్తుంది. అన్ని దానాల్లోకెల్ల విద్యాదానం ఎంతో గొప్పది.

– రాజు, ఎస్ఏహెచ్ఎస్ అధ్యక్షుడు, పులివెందుల

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేంపల్లె : ఇడుపులపాయలోని స్థానిక ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఉచిత మెగా కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామిగుప్తా తెలిపారు. శుక్రవారం క్యాంపస్‌లోని భౌతిక శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సహకారంతో కళాశాల ప్రాంగణంలో తిరుపతికి చెందిన ఇస్కాన్ హరే కృష్ణ నేత్రాలయం వారిచే ప్రశంసనీయమైన కంటి పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, భౌతిక శాస్త్ర విభాగ అధిపతి జి.కార్తీక్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెను కరువు మండలంగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పంటలు పండక రైతులు, ప్రజలు అల్లాడుతున్నారని వేంపల్లె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తీర్మానం పంపించాలని ఎంపీటీసీల తరపున జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేంపల్లె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు తీర్మాణం ప్రవేశపెట్టారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు అ తీర్మాణాన్ని మద్దతు ఇచ్చారు. సమీక్ష సమావేశానికి కొందరు అధికారులు డుమ్మా కొట్టడంతో జెడ్పీటీసీతోపాటు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లేక పోవడంవలన మండలంలోని కత్తులూరు, మిట్టపల్లి, తువ్వపల్లె, మునల్‌రెడ్డిగారిపల్లెలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసి వేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఇఓ స్టాలిన్ కోరారు. ఈ ఏడాదిలో విద్యార్థులు పాఠశాలలో చేరకపోతే మూసి వేస్తారన్నారు. రూ.15 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను నిర్మిస్తే పదవ తరగతిలో ఫలితాలు రావడం చూస్తే సిగ్గుగా ఉందని జెడ్పీటీసీ విద్యా శాఖ అధికారులపై మండిపడ్డారు. మండలంలోని రామిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని ఆవరణాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఇఓ స్టాలిన్ కోరారు. జెడ్పీ పాఠశాలకు చెందిన ఆట స్థలంకు చెందిన ప్రహరీ గోడను కూల్చివేయడం జరిగిందని, విద్యా శాఖ నిధులతో ప్రహరీ గోడను నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకొవాలని ఎంపీటీసీ మణిగోపాల్‌రెడ్డి కోరారు. ఈదురు గాలులతో 40 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. పంచాయతీలో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి రూపురేఖలను మారుస్తానని పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ యోగీశ్వరబాబు కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న ఎక్స్‌రే ప్లాంటును రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీటీసీలు అధికారులను కోరారు. ఎన్‌సీడీ సర్వే ద్వారా ప్రజలకు ఉన్న రోగాలను గుర్తిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు. సమీక్షా సమావేశానికి చెందిన నోటీసును మండల స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు తప్పకుండా చేరవేసే బాధ్యత ఎంపీడీఓ తీసుకోవాలని జెడ్పీటీసీ కోరారు. నోటీసులు ఇవ్వలేదని వస్తున్న ఫిర్యాదులను ఇంకా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంపీడీఓ, సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కుశాయమ్మ, వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ సునీత, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు రమణమ్మ, ఎంపీటీసీలు చంద్రఓబుల్ రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, హబిబుల్లా, సర్పంచ్‌లు మధుప్రభాకర్‌రెడ్డి, బయపురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వేంపల్లె : గాలి, వానకు నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.తులసిరెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈదురు గాలులతో నష్టపోయిన అరటి పంటలను ఆయన పరిశీలించి కౌలు రైతులతో చర్చించారు. అడవి పందులు, ప్రకృతి వైపరీత్యాలు, ధర లేకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి, పెనుగాలికి పూర్తిగా నేలమట్టమైందని తెలిపారు. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోకపోతే ఆత్మహత్యే తమకు శరణ్యమని కౌలు రైతులు వాపోయారు. ప్రభుత్వం ఎకరాకు కనీసం రూ.50వేల పెట్టుబడి సాయం అందించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అనంతరం వారు ఎద్దుల కొండపై ఉన్న ఆలయంపై పిడుగు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. పిడుగుపాటుకు దెబ్బతిన్న ఎద్దుల కొండ్రాయుని దేవాలయాన్ని ప్రభుత్వం పునరుద్ధరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏజీపీగా బొలిశెల్లి శ్రీనివాసులు



కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా బొలిశెట్టి శ్రీనివాసులును నియమించినట్లు లా డిపార్ట్‌మెంట్ వారు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శ్రీనివాసులు శుక్రవారం కమలాపురం కోర్టులో ఏజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2007లో కమలాపురం కోర్టులో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. 2015 నుంచి 2021 వరకు ఎర్రగుంట్ల మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్యానల్ అడ్వకేట్‌గాను, ఎల్ఐసీ ప్యానల్ అడ్వకేట్‌గానూ కొనసాగుతున్నారు. ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాలకు సంబంధించిన కేసులను వాదించడానికి ప్రభుత్వం ఆయనను ఏజీపీగా నియమించింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు, కోర్టు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడిగా పెద్దనారాయణ



చక్రాయపేట : మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడిగా గితోల్ల పెద్దనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం చక్రాయపేటలో నూతన వీఆర్ఏల మండల కమిటీ ఏర్పాటు జరిగింది. జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు నాగేందర్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా కోశాధికారి వెంకటపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని వీఆర్ఏలందరూ కలిసి ఏకగ్రీవంగా పెద్ద నారాయణను ఎన్నుకున్నారు. అలాగే మండల గౌరవ అధ్యక్షుడిగా జీఎల్ నరసింహులు, మండల ఉపాధ్యక్షుడిగా పి.రామచంద్ర, ప్రధాన కార్యదర్శిగా టి.కృష్ణయ్య, కోశాధికారిగా ఎం.వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేశవప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద నారాయణ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

దెబ్బతిన్న అరటి తోటల పరిశీలన



దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

వేంపల్లె : మండలంలో వీచిన ఈదురుగాలులకు అరటి పంట నేలకొరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉద్యానవన అధికారులు రెడ్డయ్య, సహాయకులు మహేష్‌లు నేలకొరిగిన అరటి పంటలను పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు 100 ఎకరాలు అరటి పంట నేలకొరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని అరటి తోటలను పరిశీలించి పూర్తి నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. పూర్తిగా దెబ్బతిన్న అరటి తోటలకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో అరటి రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వడుగులు

జమ్మలమడుగు : పట్టణంలోని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఉచిత వడుగులు(ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆస్థానయే గౌసియా అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఆస్థానే గౌసియాలో మాట్లాడుతూ అహలేబైత్ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నిరుపేద ముస్లిం బాలురకు ఉచితంగా వడుగులు నిర్వహిస్తారన్నారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం ప్రాంతానికి చెందిన వారు ముద్దనూరులో ఉన్న సయ్యద్‌షా నిజాముద్దీన్ ఆవులియా ఖాద్రీ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అలాగే జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన వారు పట్టణంలో గౌసియా షాదీఖానా ఎదురుగా ఉన్న ఏటీఎస్ వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.8008339266, 9949460207 నంబర్‌లకు సమాచారం ఇస్తే పేర్లను నమోదు చేస్తామన్నారు.

గాలులకు నేలకొరిగిన అరటి, మామిడి చెట్లు



నేలవాలిన అరటి పంట



గాలుల ధాటికి నేలకూలిన మామిడి చెట్ల మధ్య రైతు

చింతకొమ్మదిన్నె : మండలంలో గురువారం రాత్రి వీచిన ఉధృతమైన గాలులకు మండల పరిధిలోని గూడావాండ్లపల్లె, బుగ్గలపల్లె, ఇప్పపెంట పరిధిలోని గ్రామాలలో అరటి, మామిడి చెట్లు నేలకు పడటంతో ఉద్యాన రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. గూడా వాండ్లపల్లెకు చెందిన జగన్మోహన్‌రెడ్డి మామిడితోటలోని సుమారు 150 పైగా కాయలతో కూడిన మామిడి చెట్లు గాలుల ధాటికి నేలకు పడ్డాయి. కృష్ణారెడ్డి తోటలో అరటి చెట్లు కూడా పూర్తిగా నేలపై పడ్డాయి. అలాగే బుగ్గలపల్లె పరిధిలోని ఉద్యాన రైతులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది.

ఉద్యాన శాఖ అధికారులు కూడా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తే రైతులకు ఉపయోగం జరిగే అవకాశం ఉంటుందని, గ్రామస్థాయిలోనే యూనిట్‌గా తీసుకుని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రైతులకు కోరుతున్నారు.

నేటి నుంచి కోగటం ఉరుసు

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఆలంపీర్ ఖుద్దిసిసిర్రహు వారి ఉరుసు కార్యక్రమాలు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు మహోత్సవాలను కీ.శే. గండ్లూరు పెద్ద వీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరుకు చెందిన జామీర్ షాహజాద, బెల్గామ్‌కు చెందిన మొహసిన్ చిష్టి ఖవ్వాల్‌ల మధ్య ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. అలాగే దాతలు ఉక్కు ప్రవీణ్ సహకారంతో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి



జోషికను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : మారుమూల గ్రామాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని ఎంఈఓలు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యాలయంలో వైఎస్సార్‌టీఎఫ్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.కె.వెంకటనాథరెడ్డి ఆధ్వర్యంలో టెన్త్ ఫలితాలలో జిల్లా టాపర్‌గా నిలిచిన జోషికకు పలువురు ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ఎంఈఓలతోపాటు హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు హాజరై జిల్లా టాపర్ విద్యార్థిని జోషికకు మెమెంటోతో సత్కరించి రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖరరావు, రామానాయుడు, శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణయ్య, వైఎస్సార్‌టీఎఫ్ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, గోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టే విధించడం హర్షణీయం

పులివెందుల టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బదిలీల చట్టం 2025 అమలుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టేపై జాతీయ అంధుల సమాఖ్య రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బదిలీల చట్టంలోని రూల్ 3, 4, 5, 10, 11లోని విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు కోరడం జరిగిందని, జాతీయ అంధుల సమాఖ్య తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సంతోష్‌కుమార్ ఈ చట్టం విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇది విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం 2016కు విరుద్ధంగా ఉందని న్యాయస్థానానికి తెలియజేశారు. సంతోష్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బదిలీలచట్టంపై తక్షణమే జులై నెలాఖరు వరకు స్టేటస్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీని ప్రకారం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రస్తుత స్థితి కొనసాగుతుందని, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిలిపివేయబడుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న సంతోష్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి కిశోరి బాలికలను పరిచయం చేసుకోవడంతోపాటు లక్ష్యాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కిశోర వికాస కార్యక్రమాన్ని 12 సెషన్స్‌గా చేస్తున్నామని, జీఎంఎస్‌కేఎస్ కన్వీనర్‌గా ఉండి ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్, వీఓలు, ఎంపీహెచ్ డబ్లు కలిసి కిశోర బాలికలకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సునియా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలపకుండా గ్రామసభలను ఎలా నిర్వహిస్తారు



మాట్లాడుతున్న మండలఉపాధ్యక్షుడు జీవీ సుధాకరరెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు, ఇతర ప్రజాప్రతినిధులకు తెలపకుండా అధికారులు ఇటీవల అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారని ఇది సమంజసమేనా అంటూ మండలఉపాధ్యక్షుడు జీవీ సుధాకరరెడ్డి శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మండల ఉపాధ్యక్షుడు జీవీ సుధాకరరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయడం, పక్షపాతం చూపడం పట్ల ప్రజాప్రతినిధులు ప్రశ్నించడంతో అందుకు కారణమైన అధికారి మరోసారి పొరపాటు జరుగకుండా చూసుకుంటామని సర్ది చెప్పుకున్నారు. సచివాలయాలలో పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్లు ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ రిపేర్ల విషయంలో పలకడంలేదని, తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకురావడంతో ఏఈ వేణుగోపాల్ మరోసారి కంప్లైంట్ రాకుండా చూసుకుంటామని తెలిపారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రగతిని వివరించి, అలాగే సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉప మండల అధ్యక్షుడు సుధాకరరెడ్డి, ఎంపీడీవో కుల్లాయి బాబు మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని, అలాగే రాబోయే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

ఇచ్చిన హామీలు అమలు చేయలేని చంద్రబాబు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు

పులివెందుల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గతనెలలో అకాల వర్షానికి, ఈదురు గాలులకు దెబ్బతిన్న 670 మంది అరటి రైతుల కోసం ప్రకటించిన నష్టపరిహారానికి టీడీపీ నాయకులకు మతిభ్రమించి విషం చిమ్ముతున్నారని వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ అంబకపల్లె బాబురెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, బాబాలు తెలపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతి భ్రమించి, దిక్కుతోచని బీటెక్ రవి ఏదో లిక్కర్ స్కాం, మూడు వేల కోట్లు, నాలుగు వేల కోట్లు అని కల్లబొల్లి మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అబ్బ రాజారెడ్డి కాలం నుంచే ఇన్‌కం టాక్స్ కడుతున్నారని వారన్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి రెండు పర్యాయాలు, జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిని పట్టుకొని బీటెక్ రవి కారు కూతలు కూడయం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ మైనింగ్, రేషన్ మాఫియా, ఇసుక మాఫియా, ఇలా అన్ని రకాల దోపిడీలు చేసే నువ్వు ఎంత మేర సాయం చేశావో చెప్పాలని వారు ప్రశ్నించారు. నిజంగా ప్రభుత్వం అరటి రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఇంతవరకు ఎన్ని ఎకరాలలో నష్టం వాటిల్లిందనే అంచనాలు కూడా అధికారుల నుంచి తీసుకున్న పాపాన పోలేదన్నారు. రైతులపట్ల ఇంత నిర్లక్ష్య వైఖరి గమనించి అధికారంలో లేకపోయినా రైతులకు తక్షణ సాయం అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్ అవినాష్‌రెడ్డిని చూసి స్థానిక టీడీపీ నాయకులు, చంద్రబాబు సిగ్గుపడాలి అన్నారు. రైతుల కోసం దాదాపు రూ.20 కోట్లతో కట్టించిన కోల్డ్ స్టోరేజ్ ప్రారంభించి కూడా దాదాపు 18 నెలలు దాటుతున్నా.. దాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఏ మాత్రం కృషి చేయకుండా 18 నెలలు గడుస్తున్నా ఇంకా కాంట్రాక్టర్‌ను నియమించడానికి టెండర్లు పిలిచినా మీ కమీషన్లకు భయపడి ఏ కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదని చెప్పడాన్ని బట్టి చూస్తే ఈ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందో రైతులు గమనించాలని అని వారు పేర్కొన్నారు. పులివెందుల ప్రజలకు తాగు నీరు అందించాలనే సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలజీవన్ మిషన్ కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కలయికతో రూ.500 కోట్లతో 2021లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ దాదాపు పనులు పూర్తి చేసుకుని, ఇంకో కొద్ది శాతం పనులు పూర్తయితే ఈ ప్రాజెక్ట్ ప్రజలకు అందుబాటులోకి వస్తే ఎక్కడ వైఎస్ కుటుంబానికి మంచి పేరు వస్తుందోనని జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన పనులకు కేంద్రం నుంచి విడుదలైన బిల్లులను కూడా మేఘ కంపెనీకి ఇవ్వకుండా ఆపివేయడం జరిగిందన్నారు. చివరకు ఈ నిధులు రద్దవుతాయని కేంద్రం చెప్పితే అప్పుడు గత్యంతరం లేక రాత్రికి రాత్రే ఆ కంపెనీకి బిల్లులు చెల్లించి, ఇప్పటికి మిగిలిన పనులు పూర్తి చేయడానికి అనేక ఆటంకాలు సృష్టిస్తూ కాలయాపన చేస్తున్న మాట వాస్తవం కాదా అన్నారు. దెబ్బతిన్న రైతన్నకు భరోసాగా నిలవాల్సిందిపోయి ఇంతే వేగంతో గాలి వీస్తేనే అరటికి ఇన్సూరెన్సు ఇస్తామని చెప్పే కూటమి ప్రభుత్వం ఇచ్చే ఇన్సూరెన్సు వలన ఎలాంటి లాభం ఉండదన్నారు. లింగాల మండలంపై మా నాయకులకు ఉన్న అభిమానం, ప్రేమ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. ఈ మండలానికి సాగునీరు, తాగునీరు అందించి చిత్రావతి ప్రాజెక్టు 6టీఎంసీల నుంచి 10 టీఎంసీలకు పెంచి సస్యశ్యామలం చేసి ఇవ్వడం జరిగిందన్నారు. పదే పదే చంద్రబాబు అపాయింట్ మెంట్ ఇప్పిస్తామనే బీటెక్ రవి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న మీ చంద్రబాబుకు కరోనా రెండేళ్లు వచ్చిన ప్రజలకు ఏమీ కొదువ లేకుండా పాలించిన జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పరిపాలన ఎలా పాలించాలో మెళకువలు నేర్చుకోవడానికి అపాయింట్ మెంట్ ఇప్పిస్తామని, మీ బాబుకు చెప్పాలని వారన్నారు. అన్ని రంగాల వారిని మోసం చేస్తూ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంవల్ల కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.